పాలిథిన్ కాలుష్యం.. అమలుకాని నిషేధం

- యథేచ్ఛగా పాలిథిన్ కవర్ల వినియోగం
- ప్రజలకు, పర్యావరణానికి తప్పని ముప్పు
- పట్టించుకోని అధికారులు

దెందులూరు: ప్లాస్టిక్ వ్యర్థాలు భారీగా పెరిగిపోతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదు. బయటలకు వెళ్తే, కాళ్లు కడుక్కొని ఇంట్లోకి వచ్చే మనం పాలిథిన్ భూతాన్ని మాత్రం స్వయంగా కొనుక్కుని మరీ ఇంట్లోకి తెచ్చుకుంటున్నాం. చిన్నపాటి అశ్రద్ధ కారణంగా రోజు పదుల సంఖ్యలో పాలిథిన్ క్యారీ బ్యాగ్‌లను వాడుతూ అటు పర్యావరణానికి, ఇటు మానవ ఆరోగ్యానికి ముప్పు తెస్తున్నాం. వస్త్రంతో తయారు చేసిన చేతి సంచిని వినియోగిస్తే ఒక కుటుంబం రోజుకు పదికిపైగా ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకాన్ని తగ్గించవచ్చు. కానీ ఆదిశగా ఎవరూ ఆలోచించడం లేదు. దీంతో విచ్చలవిడిగా పాలథిన్ వ్యర్థాలు పేరుకుపోయి, ఇవన్నీ గ్రామాల శివార్లలో డంపింగ్ యార్డులకు చేరుతున్నాయి. కొండలా పేరుకుపోతున్న వీటిని వదిలించే క్రమంలో నిప్పు పెడుతున్నారు. దీంతో తీవ్రమైన వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. ఇంకా వాతావరణం వేడెక్కి కాలుష్యం మరింత పెరిగి చివరికి మానవాళికి ముప్పు తెచ్చుకుంటున్నాం. పాలథిన్ నిషేధం అమలుపై యంత్రాంగం నిర్లక్ష్యం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధానంగా ప్రతి గ్రామంలో శివార్లతో పాటు పలు ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. బాగా పెరిగిన వాటికి నిప్పంటిస్తున్నారు. కూరగాయలు, టిఫిన్ సెంటర్లు, ఇతర ఆహార పదార్థాలు ఇళ్లకు తెచ్చుకోవడానికి పాల ప్యాకెట్లు, డిస్పోజబుల్ ప్లేట్లు ఇలా ఉదయం నుంచి రాత్రి వరకు ప్రతి అవసరంలోనూ ప్లాస్టిక్ వస్తువులనే వినియోగిస్తున్నారు. ఇదే సమస్యగా మారింది.


వాడి పడేసిన ప్లాస్టిక్ బాటిల్స్, (అంతర చిత్రం) పాలిథిన్ కవర్లలో తీసుకెళుతున్న ఆహార పదార్థాలు

రోజుకు 30 టన్నుల చెత్త

దెందులూరు నియోజకవర్గంలోని ప్రతి రోజు సుమారు 30 టన్నులకు పైగానే చెత్త సేకరిస్తున్నట్టు ఒక అంచనా. ఇందులో సుమారు 3 నుంచి 5 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయని అధికారులు చెబుతున్నారు. తడి, పొడి చెత్తను వేరుచేసి సేకరించి, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేయాలనే విధానం ఎక్కడా అమలు కావడం లేదు. ప్లాస్టిక్ వ్యర్థాలను తిరిగి ఉపయోగించుకోవాలన్న ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. ఇదిలా ఉంటే బహిరంగంగా పాలిథిన్ కవర్లు విక్రయిస్తున్నా అడిగే వారు ఉండడం లేదు. అధికారుల దాడులు నామమాత్రంగా ఉండడంతో కొందరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా మారింది.

నిప్పు పెడితే ప్రమాదం

ప్లాస్టిక్‌ను కాల్చితే ప్రమాదమని తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ ప్రక్రియతో విపరీతమైన వాయు కాలుష్యం ఏర్పడుతోంది. శ్వాస సంబంధ వ్యాధులతో ఇబ్బందులు పడేవారి సంఖ్య పెరగడానికి ఇది ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంపై ఎవరికి వారు అవగాహన పెంచుకోవాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ కాల్చకుండా ప్రభుత్వ యంత్రాంగం కూడా చర్యలు చేపట్టాలని ఇందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

వినియోగం ప్రమాదం



ప్లాస్టిక్ వినియోగంతో ప్రధానంగా క్యాన్సర్ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. గుండె జబ్బులు కూడా వస్తాయి. ప్లాస్టిక్ సంచిలో వేడిగా ఉన్న ఆహారాన్ని పార్శిల్ చేయడం వల్ల అందులో ఉన్న రసాయనాలు కరిగిపోతాయి. ఆ ఆహారం తినడంతో వివిధ అనారోగ్య సమస్యలు వస్తాయి. ప్లాస్టిక్ భూమిలో కరగడానికి చాలా ఏళ్లు పడుతుంది. దీంతో పండించే పంటలు నాశనం కావడంతో పాటు ప్రజలు కూడా రోగాల పాలవుతారు.

– డాక్టర్ సుందర్, సూపరింటెండెంట్ దెందులూరు సీహెచ్‌సీ

వాడకం తగ్గించాలి



గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకం బాగా పెరిగింది. పూర్వ కాలం నుంచి ఆహార పదార్థాలను ఇంటికి తీసుకు రావాలంటే ఇంట్లో ఉన్న గిన్నెలను మాత్రమే వాడేవారు. కానీ మారుతున్న కాలం ప్రకారం ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తున్నారు. దానివల్ల ప్రజలు రోగాల పాలవడమే కాకుండా ఎంతో విలువైన భూమి కూడా కలుషితం అవుతుంది. ప్రభుత్వాలు ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి.

– నవ్య, గ్రామ సర్పంచ్ జాలిపూడి

క్లుప్తంగా

ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం


స్వామివారికి పూజ చేస్తున్న భక్తులు

దెందులూరు: మండలంలోని మొండూరు మదన గోపాలస్వామి ఆలయ 19వ వార్షికోత్సవం, ఏడో బ్రహ్మోత్సవాలు శనివారం ఆలయం వద్ద అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాణకర్త ఆలపాటి నరసింహమూర్తి దంపతులు, కుటుంబ సభ్యులు పూజలు చేశారు. అర్చకులు, నిర్వాహకులు స్వామివార్ల విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీతారామారావు


కోనే సీతారామారావు


నోముల రాముడు

ఏలూరు (టూటౌన్): అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన ఏలూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో కోనే సీతారామారావు ప్యానెల్ ఘన విజయం సాధించింది. ఈ నెల 20న శుక్రవారం నిర్వహించిన ఈ ఎన్నికల్లో మొత్తం 787 మందికి 615 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కౌంటింగ్ శుక్రవారం అర్ధరాత్రి దాటేంత వరకు కొనసాగింది. కోనే సీతారామారావు, అబ్బినేని విజయ్ కుమార్ ప్యానెల్‌లు నువ్వా నేనా అన్నట్టు తలపడ్డాయి. కోనే సీతారామారావు ప్యానెల్ నుంచి పోటీచేసిన వారిలో ఇద్దరు మినహా అందరూ గెలుపొందారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీతారామారావు, ఉపాధ్యక్షుడిగా నిస్సంకర కృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా నోముల రాముడు, జాయింట్ సెక్రటరీగా షరీఫ్, కోశాధికారిగా జి.సీతారామరాజు, మహిళా రిప్రజెంటేటివ్‌గా పి.కనకదుర్గా భవాని, లైబ్రరీ సెక్రెటరీగా కె.కృష్ణ కిషోర్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీగా గెద్దా విజయ భాస్కర్ విజయం సాధించారు. వీరిని బార్ అసోసియేషన్‌లోని పలువురు న్యాయవాదులు అభినందించారు.

కదిలిన యంత్రాంగం


అచ్యుతాపురం-శ్రీరంగపట్నం రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో, పంచాయతీరాజ్ శాఖ అధికారులు

సాక్షి స్పందన

కొయ్యలగూడెం: అచ్యుతాపురం-శ్రీరంగపట్నం రోడ్డు అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ తెలిపారు. సాక్షిలో 21వ తేదీన ప్రచురితమైన ×కొద్దిపాటి వర్షానికే ముప్పు÷ శీర్షికకు ఉన్నతాధికారులు స్పందించి, పరిష్కార చర్యలకు ఆదేశాలు జారీ చేశారన్నారు. దీంతో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలిసి రెండు గ్రామాల మధ్య ఉన్న రోడ్డు పరిస్థితి అధ్యయనం చేశామన్నారు. రూ.30 లక్షల అంచనా వ్యయంతో మెటల్ రోడ్డు నిర్మాణాన్ని చేపడతామని ఆయన గ్రామ ప్రజా ప్రతినిధులతో పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలోగా రహదారి ప్రయాణికులకు రాకపోకలు సాగించడానికి అనువుగా తాత్కాలికంగా ఉపాధి శ్రామికులతో కలిసి పనులు చేపట్టాల్సిందిగా ఎంపీడీవోను, పంచాయతీరాజ్ ఎఈ సురేష్‌ను గ్రామస్తులు కోరారు.

పూజాసామగ్రి విక్రయాలపై వ్యాపారుల మధ్య విభేదాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఓ దుకాణంలో తులసి మాలలు విక్రయాల పేరుతో పూజా సామగ్రిని విక్రయిస్తుండటం వివాదాస్పదమవుతోంది. తమకు మాత్రమే పూజా సామగ్రి విక్రయించుకునే హక్కు ఉండగా, తులసి మాలలు విక్రయించే వ్యక్తి ఎలా పూజా సామగ్రిని అమ్ముతాడని కొబ్బరికాయల విక్రయ దుకాణదారులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఇది వివాదాస్పదంగా మారింది. వివరాల్లోకి వెళితే.. శ్రీవారి ఆలయ తూర్పు ప్రాంతంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో కొందరు పోటీ పడి మరీ వ్యాపారాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే వారు నిబంధనలను మీరుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. షాపు నంబర్-8లో రెండేళ్ల పాటు తులసీ మాలలు విక్రయించుకునేందుకు ఈ ఏడాది మార్చి 22న దేవస్థానం అధికారులు బహిరంగ వేలంతో పాటు, సీల్ టెండర్‌ను నిర్వహించారు. సీల్ టెండర్ ద్వారా పాటను దక్కించుకున్న వ్యాపారి తులసి మాలలతో పాటు పూజా సామగ్రిని విక్రయిస్తున్నాడు. అయితే పక్కనే ఉన్న కొబ్బరికాయలు, పూజాసామగ్రి విక్రయ దుకాణదారులు ఇదేం దారుణమని గగ్గోలు పెడుతున్నారు. ఈ క్రమంలోనే తమ మధ్య గొడవలు జరుగుతున్నాయని, ఇవి తారాస్థాయికి చేరే ప్రమాదం ఉందని అంటున్నారు. దీనిపై ఆలయ అధికారులు దృష్టి సారించి, టెండర్ షరతుల ప్రకారం వ్యాపారాలు జరిగేలా చర్యలు చేపట్టాలని వ్యాపారులు కోరుతున్నారు.

మానవత సహాయం

ఉంగుటూరు: ఇన్‌ఫెక్షన్ అయిన కాలును తొలగించడంతో బాధితునికి మానవత సంస్థ ఆధ్వర్యంలో చంక కర్రలను ఉచితంగా అందించారు. వీటిని బాధితుడు నూతలపాటి గాంధీ స్వగ్రామమైన అక్కపల్లిలో మానవత రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి చేతులమీదుగా శనివారం అందజేశారు. త్వరలో అతనికి వీల్‌చైర్, కృత్రిమ కాలు అందజేస్తామని మానవత ఉపాధ్యక్షుడు కోనే వీరవెంకట సత్యనారాయణ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వెంకట్రాయుడికి సత్కారం


చిన్నమిల్లిని సత్కరిస్తున్న ద్వారకాతిరుమల మండల నాయకులు

ద్వారకాతిరుమల: చిన్నమిల్లి వెంకట్రాయుడు వైఎస్సార్‌సీపీ భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన సందర్భంగా శనివారం ఆయనకు భీమవరంలో అభినందన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ద్వారకాతిరుమల మండలం నుంచి పార్టీ నేతలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వెంకట్రాయుడికి పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, రాష్ట్ర మైనారిటీ సెల్ జాయింట్ సెక్రటరీ షేక్ మస్తాన్ బాషా, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు దాసరి రాంబాబు, మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, కొడుదుల ప్రసాద్ ఘనంగా సత్కరించారు.

చిన్నపాటి వర్షానికే రోడ్లపై నీరు


గుండుగొలనులో డ్రెయినేజీ లేక రోడ్డుపై నిలిచిన వర్షపునీరు


భీమడోలు రహదారి మధ్యలో నిలిచిన వర్షపు నీరు

భీమడోలు: మండలంలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో ప్రధాన రోడ్లపై సైతం వర్షపు నీరు నిలిచింది. రాకపోకలకు వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గుండుగొలను డైలీ మార్కెట్ సెంటర్ వద్ద మురుగునీరు పారే మార్గంలేక రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయింది. చిన్నపాటి వర్షానికి నీరు రోడ్డుపై ఉంటే భారీవర్షాలు పడితే ఇక్కడ పరి స్థితి ఏమిటో అని ప్రజలు ఆందోళన వ్యక్తంచేశారు. మురుగునీరు కిందకు పారేలా ఏర్పాటుచేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను గ్రామస్తులు కోరుతున్నారు. భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు రోడ్డు వెంబడి డ్రెయిన్ లేక నీరు నిలిచిపోయింది. ఎండ తీవ్రతతోపాటు ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు ఈ వర్షంతో ఉపశమనం లభించింది.

యోగా పేరిట ప్రజా సమస్యలు గాలికొదిలేశారు

సీపీఐ నేత డేగా ప్రభాకర్


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

ఏలూరు (టూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగా పేరుతో ప్రజా సమస్యలను గాలికి వదిలేశాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు డేగా ప్రభాకర్ విమర్శించారు. ఏలూరులో శనివారం నిర్వహించిన సీపీఐ ఏలూరు ఏరియా 6వ మహాసభల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి గత ఎన్నికల సందర్భంగా చేసిన వాగ్దానాలను అమలు చేయడంలో చంద్రబాబు మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. 32 మంది ఆత్మ బలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కును కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా కట్టబెట్టడానికి మోదీ ప్రయత్నం చేస్తున్నారని, మోదీ చేస్తున్న కుటిల ప్రయత్నాలని వామపక్షాలు, కార్మిక సంఘాలు పోరాటాల ద్వారా అరికట్టాలని పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, రాష్ట్ర సమితి సభ్యుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నగరంలో టిడ్కో ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, అయినా పాలకులు పూర్తి మౌలిక సదుపాయాలతో లబ్ధిదారులకు అందజేయడంలో నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని విమర్శించారు. నగరంలో 59 మురికివాడలలో డ్రెయినేజీ అస్తవ్యస్తంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

పార్టీ బలోపేతానికి సమష్టి కృషి

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని పేదవర్గాలు, రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత, విద్యార్థులకు మేలు చేసేలా గత ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారని వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ గుర్తుచేశారు. పార్టీ స్థానిక కార్యాలయంలో నూతనంగా ఏలూరు నగర పార్టీ ఈసీ మెంబర్లుగా నియమితులైన బయ్యవరపు జగదీష్, శానంపూడి మోహన్ జయప్రకాష్‌ని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

పశువైద్య శాఖలో జేవీఓల బదిలీలు

దెందులూరు: మండలంలోని పశు వైద్యశాలల్లో పనిచేస్తున్న జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లు బదిలీ అయ్యారు. నాగులదేవునిపాడు పశువైద్యశాలకు సీహెచ్ శ్రీరాములు దొర, ఇక్కడ పనిచేస్తున్న అంకమ్మ పోణంగికి, శ్రీరామవరం పశువైద్యశాలకు చల్ల చింతలపూడి నుంచి ఎన్‌వీవీ శ్రీనివాస్, ఇక్కడ పనిచేస్తున్న లక్ష్మీరాజ్యం చల్ల చింతలపూడికి బదిలీ అయ్యారు. ఇతర ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లు దెందులూరు పశువైద్య శాఖ అధికారి డాక్టర్ హరికృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఫిజికల్ డైరెక్టర్ల బదిలీ

దెందులూరు: సాధారణ బదిలీల్లో భాగంగా మండలంలోని ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లు బదిలీ అయ్యారు. పోతునూరు హైస్కూల్ పీడీ ఎం కృష్ణారావు ఏలూరు రూరల్ మండలం కండ్రిగూడెం హైస్కూల్‌కు, తోకలపల్లి నుంచి పోతునూరు హైస్కూల్‌కు పీడీ పాలు, గోపన్నపాలెం హైస్కూల్‌కు పీడీలు సీహెచ్ రమేష్, అమర్ సుల్తానా బదిలీ అయ్యారు. కామవరపుకోట నుంచి దెందులూరు హైస్కూల్‌కు డి.బాబురావు, రావికంపాడునుంచి శశాంక్‌వర్మ చల్లచింతలపూడి హైస్కూల్‌కు, దెందులూరు బాలికల హైస్కూల్‌కు పెదవేగి నుంచి ధనలక్ష్మి బదిలీపై వచ్చారు. పీడీలంతా హెచ్‌ఎంలకు జాయినింగ్ రిపోర్టులను అందజేశారు.

లక్ష్మణుడిని పరామర్శించిన జేపీ


లక్ష్మణుడిని పరామర్శిస్తున్న జయప్రకాష్, నాయకులు

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ శ్రేణులకు అండగా ఉంటామనీ ఆ పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ భరోసా కల్పించారు. అనారోగ్యంతో ఏలూరులోని ఒక హాస్పిటల్‌లో చికిత్స పొందుతోన్న పార్టీ ఏలూరు కార్యకర్త గండికోట లక్ష్మణుడును శనివారం ఆయన పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. జేపీతో పాటు పార్టీ నాయకులు కొప్పుల ఆంజనేయులు, నూకపెయ్యి సుధీర్‌బాబు, గంటా మోహనరావు ఉన్నారు.

యోగాసనాలతో ఆరోగ్యం


దెందులూరు యోగాలో పాల్గొన్న అధికారులు


ఉంగుటూరు : యోగాసనాలు వేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉంగుటూరు: యోగాసనాలతో ఆరోగ్య ప్రమాణాలు పెరుగుతాయని వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యలయం వద్ద శనివారం నిర్వహించారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఎంపీడీఓ రాజ్‌మనోజు, ఆయుర్వేదం ఆసుపత్రి మెడికల్ ఆఫీసరు ప్రసాద్, సర్పంచ్ బండారు సింధులతో ట్రైనర్ మంద జయలక్ష్మి యోగాసనాలు వేయించారు. నారాయణపురం పంచా యతీ వద్ద ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు యోగాసనాలు వేశారు. కై కరం, నారాయణపుర, చేబ్రోలు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు.

నిడమర్రు: నిత్యం యోగా చేస్తే ఆరోగ్యం బాగుటుందని జిల్లా వ్యవసాయ అధికారి, నియోజకవర్గం యోగా ప్రత్యేక అధికారి హబీబ్ బాష అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం, పెదనింద్రకొలను, చిన్న నింద్రకొలను, తోకలపల్లి, బావాయిపాలెం తదితర గ్రామాల్లో గా దినోత్సవం నిర్వహించారు.

భీమడోలు: యోగా జీవితంలో ఓ భాగం కావాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి ఆర్‌వీ నాగరాజు అన్నారు. భీమడోలు, పోలసానిపల్లి, పూళ్ల, గుండుగొలను, అంబర్‌పేట గ్రామాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించారు.

గణపవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, పంచాయతీ కార్యాలయం, మండలంలోని అన్ని విద్యా సంస్థల్లో యోగా కార్యక్రమాలను నిర్వహించారు.

ఘనంగా యోగా డే

దెందులూరు: మండలంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీఓ కె.శ్రీదేవి, గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ నతానియేలు ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు.

పెదవేగి : కొప్పాక ఆయుర్వేద వైద్యాధికారి ఎల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొప్పాక ఉన్నత పాఠశాలలో యోగా వేడుక నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి, యోగా ప్రాముఖ్యతను వివరించారు.

లబ్ధిదారుల ముఖ గుర్తింపు తప్పనిసరి


గుండుగొలను అంగన్‌వాడీ కేంద్రంలో ఆహారాన్ని రుచి చేస్తున్న పీడీ పి.శారద

భీమడోలు: జూలై ఒకటవ తేదీ నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార పంపిణీ సమయంలో ముఖ గుర్తింపు తప్పనిసరని జిల్లా ఐసీడీఎస్ పీడీ పి.శారద అన్నారు. భీమడోలు మండలం గుండుగొలను అంగన్‌వాడీ కేంద్రం-23ను శనివారం పీఓ ఎంఎస్ రాజశేఖర్‌తో కలిసి ఆమె సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. లబ్ధిదారులకు అందిస్తున్న ఆహారాన్ని రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈసందర్భంగా శారద మాట్లాడుతూ ఇకపై వచ్చేనెల ఒకటో తేదీ నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార పంపిణీ సమయంలో తప్పకుండా లబ్ధిదారులను ముఖగుర్తింపు సాధనాలతో ధ్రువీకరించాలన్నారు. లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సమర్థవంతమైన సేవలను అందించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం లబ్ధిదారులందరికీ చేరాలని ఆదేశించారు. లోపపోషణ, రక్తహీనత నివారణకు తగుచర్యలు తీసుకోవాలనిఅన్నారు. ఐదేళ్లు నిండిన ప్రతిఒక్కరిని ప్రభుత్వ బడుల్లో చేర్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ సిబ్బందేనని తెలిపారు. అంగన్‌వాడీల్లో చిన్నారుల సంఖ్య పెంచాలని ఆదేశించారు. అనంతరం మొక్కలు నాటారు. సూపర్‌వైజర్ ఎం కవిత, టీచర్ బోడ రాజమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో గొడవలు

- ఏలూరులో రెచ్చిపోతున్న నేరస్తులు
- వరుస ఘటనలతో ప్రజల బెంబేలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరం, పరిసర ప్రాంతాల్లో ఇటీవల నేరాల జోరు పెరిగింది. యువత, మందుబాబులు ఇష్టారాజ్యంగా పూటుగా మద్యం సేవించి విచక్షణలేకుండా గొడవలు, కొట్లాటలు, ఘర్షణలకు పాల్పడుతున్నారు. రెండురోజుల్లో ఏలూరు పరిసర ప్రాంతాల్లో ఒక హత్య, రెండు దాడులు, ఒక టీజింగ్ జరగటం గమనార్హం. ఏలూరులో పోలీసులు నిత్యం నిఘా ఉంచుతున్న, యువత, మందు బాబులు రెచ్చిపోవటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మద్యం మత్తులోనే వ్యక్తులమధ్య ఘర్షణలు చోటుచేసుకోవటం పట్ల జనం భయభ్రాంతులకు గురవుతు న్నారు. ఏలూరులోనే ఇలాంటి పరిస్థితి ఏర్పడడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

24 గంటలూ మద్యం అమ్మకాలు

ఏలూరు నగరం, పరిసర ప్రాంతాల్లో నిత్యం మద్యం అందుబాటులో ఉంటోంది. రాత్రిపగలూ తేడా లేకుండా మద్యం లభించటంతో యువత, మందుబాబులు మద్యానికి బానిసలుగా మారుతున్నారు. రాత్రి 10 గంటలకే మద్యం దుకాణాలు మూసివేయిస్తామని చెబుతున్నా.. తెల్లవారుజాము వరకూ కొన్ని చోట్ల మద్యం దుకాణాలు కట్టివేసినా...పక్కనే కౌంటర్ ద్వారా విక్రయిస్తున్నారు. దీంతో మద్యం మత్తులో నేరాలకు పాల్పడుతూ రెచ్చిపోతున్నారంటూ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.


సోమవరప్పాడు శివారులో హత్యకు గురైన ఎర్రబాబు


చాటపర్రులో దాడిలో గాయపడిన వ్యక్తి



దక్షిణపువీధిలో గాయపడిన వ్యక్తి

యువకుల హల్‌చల్

ఏలూరు చాటపర్రు మద్యం దుకాణం వద్ద మద్యం మత్తులో యువకులు హల్‌చల్ చేశారు. శుక్రవారం రాత్రి 9.30 గంటల సమయంలో మద్యం షాపు వద్ద ఇద్దరు వ్యక్తులు గొడవకు దిగారు. నాగేంద్ర కాలనీకి చెందిన ఒక వ్యక్తి మరొక వ్యక్తిపై దాడి చేయటంలో తీవ్ర గాయాలయ్యాయి. ఈ కేసు దర్యాప్తు ఏలూరు రూరల్ పోలీసులు చేపట్టారు.

- ఏలూరు వన్‌టౌన్ దక్షిణపువీధి ప్రాంతంలో మద్యం మత్తులో మేనమామ, మేనల్లుడు కొట్టుకున్నారు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో పూటుగా మద్యం సేవించటంతో మాటామాటా పెరిగి మేనల్లుడు కిరణ్ మేనమామ రామాంజనేయులును బీరు బాటిల్ పగులగొట్టి పొడిచాడు. తీవ్ర గాయాలు కావటంతో అతడ్ని చికిత్స నిమిత్తం ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. అనంతం విజయవాడ తరలించారు. ఈ మేరకు కేసును వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.
- ఏలూరు ఎన్‌ఆర్‌పేట జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో రెండు వర్గాలు రోడ్డుపై గొడవకు దిగారు. మోటారు సైకిల్‌పై భార్యభర్త వెళుతుండగా ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వెంబడిస్తూ భార్యను టీజ్ చేస్తున్నారంటూ వారిపై గొడవకుదిగారు. వారంతా రోడ్డుపై కొట్టుకున్నారు. పోలీసులు వచ్చి వారించి స్టేషన్‌కు తరలించారు. ఈ కేసును ఏలూరు త్రీటౌన్ పోలీసులు విచారిస్తున్నారు.
- ఏలూరు టూటౌన్ పరిధిలో ఉన్న పాములదిబ్బకు చెందిన మింగి ఎర్రబాబు అనే వ్యక్తిని పాత కక్షల నేపథ్యంలో మండలం సోమవరప్పాడు శివారులో శనివారం ఉదయం 11 గంటలకు రోడ్డు పై అతికిరాతకంగా నలుగురు వ్యక్తులు నరికి హత్య చేశారు. చోరీ కేసులు, కొట్లాట కేసుల్లో నిందితుడిగా ఉన్న ఎర్రబాబును పక్కా ప్లాన్‌తో హత్య చేసినట్టు చెబుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఉక్కుపాదంతో అణిచివేస్తాం



ఏలూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో నేరాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదు. ఉక్కుపాదంతో అణిచివేస్తాం. గొడవలు, ఘర్షణలపైనా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం. మద్యం సేవించి రాత్రివేళల్లో బయట తిరిగితే సహించేది లేదు. పాత నేరస్తుల కదలికలపైనా నిఘా పెడతాం. రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేస్తాం. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– డి.శ్రావణ్‌కుమార్, ఏలూరు డీఎస్పీ

జాయింట్ ఎల్‌పీఎంల సబ్ డివిజన్‌పై సమీక్ష

కొయ్యలగూడెం: జాయింట్ ఎల్‌పీఎంలను సబ్ డివిజన్ చేసే ప్రక్రియలో చొరవ చూపాలని తహసీల్దార్ ఎస్.నాగరాజు ఆదేశించారు. శనివారం ఆయన మాట్లాడుతూ రీ సర్వే చేసిన గ్రామాల్లో 2,677 జాయింట్ ఎల్‌పీఎం పట్టాదారులను గుర్తించామన్నారు. ఈ నెల 30లోపు పట్టాదారుల విభజన చేసి, వ్యక్తిగత ఎల్‌పీఎంలను కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. జాయింట్ ఎల్‌పీఎంలు గల రైతులు తమ భూమికి సంబంధించిన రికార్డులతో వీఆర్‌వో లేదా సర్వేయర్లను సంప్రదించాల్సిందిగా సూచించారు.